
# శుభలేఖ

చకిలం విజయలక్ష్మి



"అమ్మా, ఉదయం ప్రయాణం ఉంది. బట్టలవీ సర్ది ఉంచు" అన్నాను భోజనం చేసి, తుండుతో చేతులు తుడుచుకుంటూ.

"ఎన్ని రోజులు?" అడిగింది అమ్మ.

"ఒక రోజులోనే పని అయిపోవచ్చు. ఎందుకైనా మంచిది, రెండు రోజులకు సర్దు" అన్నాను ఇక తలకు వచ్చేస్తూ.

ఆఫీసు గదిలోకి వచ్చి, రేపు వూరికి వెళ్ళవలసిన కేసు తాలూకు ఫైల్సు తెరిచాను.

సాక్షి వో వృద్ధురాలు. బొత్తిగా కదలలేదు. అందువల్ల నేనే అక్కడికి వెళ్ళి పూర్తి వివరాలు స్వయంగా కనుక్కోవాలని ఇప్పుడు బయలుదేరటం. కావాలంటే కోర్టులో సాక్ష్యానికి ఒకసారి పిలిపించవచ్చు. నేను వెళ్ళవలసిన వూరు రామాయపాలెం.

రామాయపాలెం!

రామాయపాలెం!

రామాయపాలెం!!!

మాటిమాటికీ ఫైలులో కనిపిస్తూన్న ఆ వూరి పేరు మరుపు తలుపులను తెరుచుకుంటూ పోతోంది.

రామాయపాలెం!

రామాయ...పాలెం!

తలుపులన్నీ తెరుచుకోగా లోపలి జ్ఞాపకాల జ్యోతి తాలూకు కిరణాలు జిగేలుమన్నాయి!

అవును!

రామాయపాలెం! రాఘవరావు మాస్టారు! రామాంజలి! అంజలి...అంజూ!

ఒక్కసారిగా మెదడులోని రక్తనాళాల్లో స్మృతులు రుధిరమై ప్రవహించ సాగాయి.

నాన్న వెటర్నరీ డాక్టర్. అందువల్ల ఆయన ఉద్యోగ నిర్వహణా కాలంలో మూడు వంతులు పల్లెటూళ్ళలోనే గడిచిపోయింది. తరచుగా ట్రాన్స్‌ఫర్స్ వస్తూండేవి వో పల్లెనుండి మరో పల్లెకు. రామాయపాలెం ఆ పల్లెల్లో ఒకటి. బాల్యానికి సహజమైన ఆనందంతోపాటు అందాన్నీ కూర్చిన వూరు రామాయపాలెం.

మా ఇంటి పక్కనే రాఘవరావు మాస్టారుండేవారు. స్కూల్లోని రాఘవరావు మాస్టారుగా కంటే పక్కింటి రాఘవరావు మాస్టారుతో నా అనుబంధం బలమైంది. స్కూల్లో కఠినంగా వుండే ఆయన, పొరుగువాడుగా చాలా సాత్వికుడు, సరదా మనిషి. కొత్త రకాల ఆటలు నేర్పడంలో, పురాణాల్లోని కథలకు మరిన్ని రంగులు పూసి చవులూరించడంలో మహా దిట్ట.

వోసారి వూళ్ళో కురుక్షేత్రం నాటకం వేశారు. ఆ తర్వాత కుర్ర నాగన్నలందరూ వెదురు దబ్బల విల్లంబులతో వూరిని మరో కురుక్షేత్రం చేశారు. తమాషా ఏమిటంటే మా గాండీవాలూ, అస్త్ర, శస్త్ర బ్రహ్మాస్త్రాలన్నీ రాఘవరావు మాస్టారి చేతి మీదుగా తయారైనవే. చొప్పదంటు అంబు చివర తుమ్మముల్లు గుచ్చి, చెప్పిన చోట దించుతూన్న నన్ను ఆప్యాయంగా అక్కున చేర్చుకుని "ఈ అర్జునుని అల్లుడిగా చేసుకునేందుకు ఏ ద్రుపదుడు తపసు చేశాడో" అనేవారు.

నా కత్యంత ప్రీతిపాత్రుడూ, గౌరవనీయుడూ అయిన ఆ మాస్టారి కడగొట్టు కూతురు రామాంజలి. బయటివారు 'అంజలి' అనేవారు. దగ్గరివారు అంజూ

అందంచిందే, శుభ్రమైన నల్లని జుట్టుకు అవసరం- కెఎమ్‌పి కొబ్బరినూనె ఇచ్చే సంరక్షణ.

కెఎమ్‌పి కొబ్బరినూనెలో ప్రకృతిలోగల విశిష్టత ఉంది. వెండిలా తెల్లని ప్రతి నూనె చుక్కాగూడా మీ జుట్టుని కుదుళ్ళనుంచి కొనలదాకా పెంపొందిస్తుంది. శీతాకాలంలో చుండ్రును దూరంచేస్తుంది; వేసవిలో, చర్మాన్నీ, జుట్టునూ ఎండనుంచీ, వేడినుంచీ కాపాడుతుంది. దాంతో యిక మీ జుట్టు శుభ్రంగా, తీరుగా, దువ్వుకోడానికి వీలుగా ఉంటుంది. రోజంతా.

"కెఎమ్‌పి. నేను అచ్చంగా సొంతంగా కోరుకునేది."

కె. ఆర్. విజయ




maa KMP 6 TEL A

అనేవారు. నేనా 'అంజే'. తెల్లగా, బొద్దుగా బుట్ట బొమ్మలా ఉండేది.

మా ఇద్దరికీ పేచీ వస్తే నేను 'బోండాం' అని ఏడిపించేవాణ్ణి. అంజు 'మురళీ' (మురళి) అనేది బదులుగా. పెళ్ళి ఆటలాడితే ఎప్పుడూ నేను మొగుణ్ణి. అంజు పెళ్ళాం. పెళ్ళికొడుకు మారితే తను పెళ్ళికూతురు పాత్ర పోషించేది కాదు. కురుక్షేత్రం నాటకం వేశాక ఓసారి నేను ఆటలో దుర్యోధనుడి పాత్ర వేయవలసి వచ్చింది. అంజు చూస్తే ద్రౌపది వేయనంది. భానుమతినే అంది. 'దుర్యోధనుడు దుర్మార్గుడే బోండాం' అని కసిరినా వినలేదు.

ఇప్పుడు తల్చుకుంటే నవ్వొస్తోంది. ఆ సిగ్గూ, బిడియమూ, కల్లా, కల్మషమూ ఎరుగని జీవితం ఎంత మధురమైంది! ఎక్కడి రామాయపాలెం! ఎప్పటి ఆ తీయని అనుభవాలు! కేవలం గుర్తు చేసుకో వలసిన స్మృతులుగా మిగిలిపోయాయి.

రాఘవరావు మాస్టారికి మగపిల్లలు లేరు. అంతా ఆడపిల్లలే. అంజు తల్లికి మగపిల్లలంటే ప్రాణం. ఆ భ్రమను చంపుకోలేక అప్పుడప్పుడూ అంజుకు చొక్కా, నిక్కరూ వేసేది. అలాంటి దుస్తుల్లో ఓసారి నా దగ్గరకు వచ్చింది. అంజు చేతుల్లో పరికిణీ, జాకెట్ వున్నాయి.

"మురళీ! ఈ బట్ట లేసుకో" అంది.

"ఛీ! ఇవి ఆడవాళ్ళు వేసుకుంటారు" అన్నాను చీదరగా.

"మరేలా! ఈ రోజు మొగుడు పెళ్ళాలాట ఆడా లని నాయుడు మామయ్య వాళ్ళ రాము అన్నాడు. నేను చొక్కా వేసుకున్నానుగా? నేను మొగుడ్నై పోయాను."

"నేను నీ కంటే పెద్ద. పెద్ద పెళ్ళాం వుండదు" అన్నాను.

"కృష్ణయ్య కంటే రాధమ్మ పెద్దదట" అంది ఆరిందాలా.

ఇది మాస్టారుగారి బోధనామృత సారం కాబోలు! మరి ఆ రోజు నేను రాధ పాత్ర వేశానో లేదో గుర్తు లేదు.

ఓ వైపు అమాయకురాలిగా, మరో వైపు ఆరిందా అయిన అంజు ఇప్పుడెలా వుందో! బహుశా ఆ బోండాం ఇప్పుడు మరీ లావెక్కి చూడగానే నవ్వు పుట్టించేలా తయారై వుంటుంది.

ఇదంతా గుర్తుకు రాగానే నా ఆ చిన్ననాటి స్నేహితురాలిని చూడాలనే కోర్కె చిత్రంగా వుదయించింది. అయినా అంజు ఇంకా అక్కడేవుంటుందా? మాస్టారెప్పుడో పెళ్ళి చేసి పంపి వుంటారు.

ఒకరి ఇల్లాలైన అంజు, చిన్ననాడు ఆటల్లో ఓ పరాయి అబ్బాయి పెళ్ళానిగా మనస్ఫూర్తిగా పాల్గొన్నాననే విషయం గుర్తు వస్తే ఎలా ఫీలవు తుందో! తన చిన్ననాటి చిలిపి ఆటలు భర్తతో చెప్పే వుంటుందా? చిన్నతనాన్ని చిన్నతనంగానే తీసి పార వేసే విశాల హృదయుడైతే చెప్పే వుంటుంది. మరి అతగాడెలాంటివాడో!

అరవిందంలాంటి అంజు ఓ యువతిగా, ఇల్లాలిగా దర్శనమిచ్చే దృశ్యం నా నేత్రద్వయం ముందు తమా షాగా కదలాడసాగింది.

నేను దుర్యోధనుణ్ణయితే భానుమతిగానైనా నాపరే వేస్తానని అంజ నే నిప్పుడు నిండు యౌవనాన్ని సంతరించుకున్న పురుషుడుగా ఎదురైతే ఏమంటుందో! త్వరలోనే ఒక అమ్మాయిని పెళ్ళాడబోతున్నాననే విషయం చెబితే చిన్ననాటి చిలిపి మాటలు గుర్తు చేసుకుని అవాకగా నవ్వుతుంది కాబోలు! అయినా అంజ ఇప్పుడు పుట్టింట్లోనే వుంటుందనే గారంటీ ఏముంది? చాలా రోజుల తర్వాత పెట్టె తెరవగా అందులో పెట్టి మరిచిపోయిన మొగలి పూల తాలూకు పరిమళం ఒక్కసారిగా గుప్పుమన్నట్లుగా ఆకస్మాత్తుగా అంజ స్మృతి తీయని జ్ఞాపకాలను రేపుతూండగా, సమయానికి ఆమె వుంటుందో లేదో, చూడగలనో లేదో అనే సందిగ్ధం ముల్లులా గుచ్చుకుంటూ చికాకు పరచసాగింది.

## 2

కేసు తాలూకు సాక్ష్యాలు త్వరగానే లభించి మధ్యాహ్నానికంతా వచ్చివనని అయిపోయింది. నా క్లయింటు తాలూకు బంధువుల ఇంట్లో భోజనం ముగించి, రాఘవరావు మాస్టారింటికి ఒంటరిగా బయలుదేరాను. అంతవరకూ నేను ఫలానా అని గానీ, మాస్టారు గురించి ఎంక్వయిరీ చేయడంగానీ చేయలేదు. ఏకంగా మాస్టారింటికి వెళ్ళి, స్వయంగా, ఒక్కసారిగా ఆ వాతావరణాన్ని ఎదుర్కోవాలనే అభిప్రాయంతోనూ, అంతవరకూ నే ననుభవించవలసిన నిలువనివ్వని ఆతురతను చంపుకోకూడదనే ఆకాంక్షతోనూ అలా చేశాను.

వూరు బాగా మారినందువల్ల మాస్టారింటికి దారులు మారాయి. అయినా ఎవరి సహాయం తీసుకోకుండా కొద్దిగా శ్రమపడినా స్వయంగానే మాస్టారిల్లు కనుక్కున్నాను.

జీవితంలో ఎన్నో చిత్రమైన అనుభవాలు ఎదురవుతూ వుంటాయి. దాదాపు పదిహేనేళ్ళ తర్వాత ఒకనాడు నే నెంతో అభిమానించిన మాస్టారినీ, మరెంతో నెయ్యం నెరిపిన నెచ్చెలినీ ఈ మధ్య కాలంలో ఒక్కసారి కూడా కలుసుకోకుండా, ఇన్నేళ్ళ తర్వాత చూడబోతూన్న ఈ అనుభవం మరీ విచిత్రంగా వుంది.

వయసు పెంచుకున్న ఇంటిని పరిశీలిస్తూ లోపలకు వచ్చాను. వసారాలో తలంతా ముగ్గు బుట్టలా నెరిసిన ఒక వృద్ధుడు, కూర్చునే మంచానికి నవారు అల్లుతున్నాడు. పరీక్షగా చూడగా ఆయన మరెవరో కాదనీ, రాఘవరావు మాస్టారేననీ తేలింది.

వార్ధక్యానికి బాగా లొంగి పోయినట్టుగా వంగిన ఆయన నడుము చెబుతూంది. చెంపల దగ్గర కొద్దిగా నెరిసిన జుట్టుతో, ఎంతో ఉత్సాహంగా, నవ యువకుడిలా మసలిన ఆ నాటి మాస్టారు కళ్ళ ముందు మెదిలారు.

దగ్గరగా వెళ్ళి "మాస్టారూ" అని పిలిచాను.

"ఎవరూ?" అంటూ ఇటు తిరిగారు.

"నేను మాస్టారూ" అన్నాను.

ఆయన కళ్ళ మీద చేయి అడ్డు పెట్టుకుని పరీక్షగా చూశారు. ఇన్నేళ్ళ తరవాత, చూపు మందగించిన ఆ వృద్ధునికి నా పోలిక అందటం కష్టమే!

"నేను మాస్టారూ, మురళిని".



"మురళా? ఏ మురళి?"

నిజమే. నాకు తెలిసిన రాఘవరావు మాస్టారు ఈయన ఒక్కరే. ఆయన సర్వీసులో మురళిలు ఎందరో!

"పదిహేనేళ్ళ క్రితం ఇక్కడ పశువుల డాక్టర్‌గా పని చేసిన మాధవరావుగారి అబ్బాయిని."

ఆయన ఆలోచిస్తున్నట్లుగా కనుబొమలు ముడి వేశారు.

ఆయన మరీ శ్రమ పెట్టడం ఇష్టంలేక—"కురుక్షేత్రం నాటకం వేశాక నన్ను మీ రెప్పుడూ అర్జునుడని అనేవారు. ఏ ద్రుపదుడు. . ." అంటూ బిడియంగా ఆగిపోయాను.

ఆయన బొమ ముడి వీడిపోయింది. కళ్ళలో జ్ఞాపకాల తాలూకు వెలుగులు కదలాడగా తెల్లని మీసాల చాటునుండి భళ్ళున నవ్వుతూ "ఒరి నీ వల్లా మురళీ" అంటూ దగ్గరకు వచ్చారు.

"ఎంత వాడివయ్యావ్! రా, కూర్చో" అంటూ వసారాలోనే పరిచిన చాప మీదను వడిచారు. నేను ఆయన పక్కనే కూర్చున్నాను.

"ఇన్నేళ్ళ తరవాత ఈ వూరూ, ఈ మాస్టారూ గుర్తు కొచ్చారన్న మాట!" అన్నారు ఆప్యాయతతో కూడిన విస్మారంతో.

'అదేం లేదు. మిమ్మల్నెప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉన్నాను" అని అబద్ధం చెప్పలేక మౌనంగా ఉండిపోయాను.

"మీ నాన్నగారు బాగున్నారా? బహుశా రిటైర్ అయి ఉండాలి. మీ అమ్మ లక్ష్మీదేవిలా ఉండేది. కానీ, పాపం అప్పుడప్పుడూ సుస్తీ పడేది. ఇప్పుడు ఎలా ఉంది?" అన్నారు.

"అమ్మ ఆరోగ్యం బాగానే ఉంది మాస్టారూ నాన్నగారే. . .పోయారు" భారంగా అన్నాను.

"హరి హరీ—ఎంత పని జరిగింది! పెద్దగా వృద్ధుడుకూడా కాడే. హు! అయినా మృత్యువుకు వయసుతో పనేముంది!" చాలా బాధ పడ్డారు మాస్టారు.

"మీ రెలా ఉన్నారు మాస్టారూ?" అడిగాను.

"ఎలా ఉండేందుకు ఏముంది బాబూ! ఇల్లాలు వల్లకాడును వరించింది. అతి ప్రయాసతో నలుగురాడపిల్లలకు పెళ్ళిళ్ళు చేశాను."

మాస్టారికి అయిదుగురు కదూ ఆడపిల్లలు. మరి అయితే అంజ. . . కానీ అంజ గురించి అడగటానికి బిడియంగా అనిపించింది.

అంజకు పెళ్ళి కాలేదా? అయితే ఇంట్లోనే ఉందా?

"ఉండు మురళీ! కాసిని మంచినీళ్ళు పట్టుకు వస్తాను" అంటూ, నేను వారిస్తున్నా ఇంట్లోకి వెళ్ళారు.

అంజ ఇంట్లో లేదు. ఉంటే అంజను కేక పెట్టకుండా మంచినీళ్ళకు ఆయ నెందుకు వెళతారు? మరయితే ఏముంది అంజ? ఎక్కడుంది?

మాస్టారు ఒక చేత్తో మంచినీళ్ళ గ్లాసూ, మరో చేతో కాఫీ గ్లాసూ పట్టుకొచ్చారు.

"ఈ వేళప్పుడు ఇంత శ్రమ ఎందుకు మాస్టారూ? నే నిప్పుడే భోజనంకూడా చేసి వచ్చాను."

"ఫరవాలేదు లేవోయ్. శ్రమేముంది? ఫ్లాస్కులో పోసి వెళుతుంది. అదే నేను తెచ్చాను. అంతే" అన్నారు.

అంజ! అయితే అంజ ఇక్కడే ఉంది. కానీ కాఫీ ఫ్లాస్కులో పోసి ఎక్కడికి వెళ్ళింది?

ఏమనుకుంటారోనని జంకు కలిగినా అడిగేశాను "అంజకు ఇంకా వివాహం చేయలేదా మాస్టారూ?"

బరువుగా నిట్టూర్చారాయన.

"దానికి కల్యాణ గీత లేనట్లుంది బాబూ!"

"అదేం! ?" ఆశ్చర్యపోతూ అడిగాను.

కొంప దీసి మరీ లావెక్కి ఏ వరుడికీ నచ్చక పోవడం లేదు కదా!

ఏముంటే ఏం చెప్పగలం మురళీ? ఎన్నో సంబంధాలు వచ్చాయి. ఎందర్నో తీసుకు వచ్చాను. అసలు వాళ్ళ ముందుకు రావడం కానీ, వాళ్ళ ముఖాలు చూడటం కానీ చెయ్యదు. కారణమూ చెప్పదు" బాధగా అన్నారు.

"బహుశా వృద్ధాప్యంలో మిమ్మల్ని ఒంటరిగా వదిలి వెళ్ళలేక కాబోలు" అన్నాను.

"అదేం లేదయ్యా. నిజానికి అంజ గురించే నే నిక్కడ ఉన్నాను. నా పెద్ద కూతుర్ని మేనల్లుడికే ఇచ్చాను. అంజ అత్తగారింటికి వెళితే నన్ను దగ్గిర పెట్టుకోవాలని నా కూతురూ, అల్లుడూ ఎదురు చూస్తున్నారు" అన్నారు మాస్టారు.

# తెల్ల మచ్చల వైద్యం

వైద్యంనుండి చక్కటి ఫలితాన్ని పొందండి



ఈ వైద్యం కోసం మందును ఎవరైనా చేయవచ్చును విశ్వసనీయమైన ఫలితాన్ని చూచి మొటరెట్టండి

BHARAT AYURVEDASHRAM P O. KATRI SARAI (GAYA)






కామెర, గజ్జి, చిడుము
పాదములమీద మరియు వేళ్ల మధ్య పగుళ్లను
పోగొట్టుటకు దివ్యమైనది.

SAPAT & CO., BOMBAY 2.

TEL.

విజయవాడ ... కార్పొరేషన్.

—520010.








స్థాపితం: 1957 ఫోన్ నెం. 846188

మీరు: మీ ఇంటియందుండే తపాల సాధ ముందాప్వారా చిత్రకళ నేర్చుకొని రెండు సంవత్సరములలో ఉత్తమ చిత్రకారులు కావచ్చును.

యావద్భారత దేశము నుండియు, విదేశములనుండియు అనేక వందల మంది విద్యాలయములో విద్యార్థులుగా చేరి ఉత్సాహముతో శిక్షణ పొందుచున్నారు.

మీరు కూడా ఈ సులభ పద్ధతులతో చిత్రకళ నభ్యసించుటకు సమ్మతించుచున్నారా? వివరముల కొరకు తొమ్మిది పైసల స్టాంపులను పంపండి.

**SANTHANU's CHITIRA VIDYALAYAM,**
**C/o CHITIRAKULLAN, 179, Singanna Chetty Street, Chintadripet, Madras - 600 002.**

Arjee


చాలా సేపు తటపటాయించి అన్నాను. "ఏదైనా" అంటూ ఆగిపోయాను.

మాస్టారు చాలా తెలివిగల వారు.

"...ప్రేమ వ్యవహారమంటావా? అదీ కాదు. ఎవరినీ ప్రేమించిన ఆచూకీ లేదు. అక్కడికీ తోటి స్నేహితురాళ్ళతో అడిగించి చూశాను. ఎవరికైనా మనసిచ్చి ఉండినా దాని కోరిక తీర్చటానికి నా కేమీ అభ్యంతరం లేదు."

నాకు అయోమయంగా అనిపించింది. అంజకు పెళ్ళంటే ఎందు కిష్టం లేదు?

"మరైతే అంజ ఇప్పుడేం చేస్తూ ఉంటుంది మాస్టారు?"

చెబుతున్నారు మాస్టారు.

"నా కో పొలంతోట ఉండేది. నీవూ, అంజా వెళ్ళి రేగుపళ్ళు దొబ్బుకు వచ్చేవాళ్ళు చూడూ, అది. అంజ ఇప్పుడు దాన్ని చాలా శ్రమ పడి సాగులోకి తెచ్చింది. కూరగాయలూ, పూలూ పండిస్తూ ఉంది. పగలంతా దానికి ఆ తోట లోనే సరిపోతుంది. దానికి వ్యాపకానికి వ్యాపకమూ, నాకు జరుగుబాటూ రెండింటికీ బాగానే ఉంది. ఇక రాత్రి పూట, పగలంతా పనుల్లోకి పోయే పిల్లల్ని పోగేసుకుని చదువు చెబుతూ ఉంటుంది. దాని తీరు తెన్నులు చూస్తే ఈ రకంగానే జీవితంలో స్థిరపడే ప్రయత్నాలనిపిస్తోంది." మాస్టారి కంఠం తడిసింది.

ఆ తరవాత ఉన్న పావు గంటలో మాస్టారు అంజ పెళ్ళి గురించే విచారించారు. నా విషయా లడిగి తెలుసుకున్నారు.

లేచి వచ్చాను.

ఎండ పడుతూ మళ్ళీ నీరెండలోకి తిరిగింది. బంగారు నీరు పోసిన చిత్రపటంలా ఉంది పల్లెటూరి ప్రకృతి. పట్నంలో మిట్ట మధ్యాహ్నం తప్ప దర్శన మివ్వని సూర్యుడు, కోపం తగ్గిన మనిషిలా శాంతంగా, సాత్వికంగా ఉన్నాడు.

దూరంగా తోట దర్శన మిచ్చింది. రేగుళ్ళ ముళ్ళ కంచెలతో, రాయీ రప్పతో ఉండే పొలంతోట ఇప్పుడు దూరానికి నందనోద్యానవను సమానాలా ఉంది. అంచు కట్టిన బంతి పూల మొక్కలు నిగనిగలాడాయి. సూర్యుని కిరణంలో, లజ్జతో అదోరకంగా నిలబడిన దాసురాలిల్లా ఉన్నాయి ప్రొద్దుతిరుగుడు పువ్వులు. దగ్గరకు వెళ్ళే కొద్దీ పట్టివేళ్ళ వినవ కర్రలా చల్లని గాలి సేద దీర్చసాగింది. తోట మధ్యన చిన్న కుటీరం కూడా కనిపించింది. తోట చుట్టూ కట్టిన దడి కున్న చిన్న చెక్క గేటు తోసుకుని లోనికి అడుగు పెట్టాను.

దూరంగా ఇద్దరు కూలి వాళ్ళు కాబోలు తోటలో పని చేసుకుంటున్నారు.

నేను ఆగి చుట్టూ చూశాను. రకరకాల కూరగాయలు, పూలమొక్కలు పచపచ లాడుతూ నేత్ర పర్వంగా ఉన్నాయి. పాళ్ళు కట్టి, చామంతులు కొత్తిమీర, ఆకుకూరలు వేశారు. దుంపలు, తీగ పాదులు కూడా పెట్టారు. దూరంగా చిన్న నూతి బావి కనిపిస్తోంది. అక్కడి నుండి ప్రతి పాదుకు ప్రతి మొక్కకు నీళ్ళు అందేలా చిన్న కాలువలు తీశారు. జమ్ముతో కప్పిన కప్పు అంతా అల్లుకున్న బీర తీగ, ఒత్తుగా పూత పెట్టి, పూల పరిమళం

ఛ్చిన పెళ్ళి కూతురులా ఉంది కుటీరం.

నెమ్మదిగా ముందుకు అడుగులు వేస్తూ వెళ్ళి పోగాను.

మొక్కు కూడా సరిగ్గా తుడుచుకోవడం రాని ఆ బోండాం ఈ నందన వనాన్ని తయారు చేసిం దంటే చాలా ఆశ్చర్యంగా వుంది. తోటను కాస్త శ్రమ పడితే ఎవరైనా పెంచగలరు. కానీ ఏ మొక్క లెక్కడ ఉండాలో, ఏవి ముందు వైపు కనిపిస్తూ ఉండాలో, ఏవి వెనక ఉంటే బాగుంటుందో— ఇంత కళాత్మకమైన దృష్టి అందరికీ ఉండదు. మళ్ళు కట్టడంలోనూ, తీగలు పాకించడంలోనూ, పూల మొక్కలను ఎక్స్‌పోజ్ చెయ్యడంలోనూ ఎంతో కృషి, నైపుణ్యము కనిపిస్తున్నాయి. మొత్తం మీద తోటంతా ఎంతో అందంగా, ఆర్టి స్టిక్‌గా ఉంది.

ముగ్ధుణ్ణయి చూస్తూ ఉండగా హఠాత్తుగా కుటీరం తలుపులు తెరుచుకున్నాయి. గుమ్మంలో పూల సజ్జ పట్టుకున్న ఒక యువతి ప్రత్యక్షమైంది. చూస్తూండగానే తలవంచుకుని ముందుకు రాసాగింది.

సన్నగా, మరీ నాజూకుగా వుంది!

తెల్లగా సిరిమల్లె పువ్వులా, చంద్రకిరణంలా ఉంది!

కణ్వాశ్రమంలో పెరుగుతూన్న శకుంతలా అతి ముగ్ధగా ఉంది!

వాల్మీకి ఆశ్రమానికి చేరుకున్న సీతలా అత్యంత మనస్వినిలా ఉంది!

బాగా దగ్గరకు వచ్చాక ఆమె చూపులు నా మీద పడ్డాయి. ఆమె కళ్ళలో ఆశ్చర్యం మొగ్గ తొడిగింది. ఆమె కనుబొమలు ఆలోచనలో ముడి పడ్డాయి. ఆ ముడిలో ఏదో పోలిక తచ్చాట్లాడింది. అవును! అది రాఘవరావు మాస్టారిలోని ముడి. అవును! అంజా! అంజే!

ఇదెలా సాధ్యం! బొద్దుగా, బోండాంలా ఉండే అంజా... బొండుమల్లెలా...

లావుగా చూడగానే ఏడిపించా లనిపించేలా ఉండే అంజా... లావణ్యలా!

ఆశ్చర్యపు ఒత్తిడికి నా కళ్ళు పెద్దవయ్యాయి.

"అంజా" అని గొణిగాను అతి అస్పష్టంగా.

ఉలికి పడింది అంజా.

ఎవరీ దుస్సాహసి అన్నట్లుగా ఆమె కళ్ళలో కరుకుదనం మెరమెర లాడింది.

"ఎవరు?" జలతరంగిణిలా అంజా కంఠం.

"నేను... మురళి".

ఆశ్చర్యం! మాస్టారిలా అంజా ఆలోచనలో పడి పోలేదు! రోజూ ఎదురు పడే వ్యక్తి పేరులా కాకపోతే అనుకోకుండా ఎదురుపడినట్లుగా "ము.ర.ళి" అంటూ అంజా అధరాలు మధురంగా కదలాడాయి.

మంజా కళ్ళలో ఆశ్చర్యం, ఆ వెంటనే ఆనందం జంట పువ్వుల్లా పూచాయి.

పూచిన పూ మకరందాన్ని దోచే మధుకరాల్లా కనురెప్పల తుమ్మెద రెక్కలు బరువుగా వాలి పోయాయి.

మల్లెపూల చెండు మధ్యన తురిమిన ఎర్ర గులాబీలా అంజా బుగ్గమీద సిగ్గు అందంగా పూచింది. బహుశా చిన్ననాటి తలపుల ఎత్తిపొడుపులు కాబోలు!

అంజా బుగ్గల మీద తొడిగిన మొగ్గలే తోట లోని మొక్కల మీద పూలై విరిశాయి కాబోలని పించింది.

అంజా తెప్పరిల్లి చూసింది.

"లోపలకు రా మురళీ" అంది.

ఆమె వెనకే కుటీరంలోకి వెళ్ళాను.

అంజా చూపిన చాప మీద కూర్చున్నాను.

కాసేపు ఇద్దరి మధ్యా వయసు తెచ్చిన బిడియం మౌనతాళాన్ని బిగించింది. మగవాణ్ణి కాబట్టి నేనే బిడియపు తాళాన్ని వూడదీశాను.

"అంజా! బాగున్నావా?"

"నే నింకా గుర్తున్నానా మురళీ?" కుటీరపు గోడ నానుకుని నిలబడి అంది అంజా.

"లేకపోతే చూడటానికి వస్తావా?"

"ఇన్నాళ్ళు?"

"దేనికైనా సమయం రావలసిందే."

"ఇప్పుడు సమయం వచ్చినది నేను గుర్తు రావడానికా, ఇక్కడికి రావడానికా?"

ఇరకాటంలో పెట్టేసింది అంజా. నిజం చెప్పా లంటే రెంటికీ కలిసి ఒక్కసారే వచ్చింది సమయం.

"నీ వేం చేస్తున్నావ్ మురళీ?"

"లాయర్!"

"మరి మాటలు బాగా వచ్చి ఉండాలే?"

"క్రాస్ క్వశ్చన్స్ వేయవలసింది లాయర్. ఇత రులు క్రాస్ చేస్తే లాయర్ సమాధానం చెప్పడు." చాలా తెలివిగా మాట్లాడా ననుకున్నాను.

"క్రాస్ చేయడం ఏమోకానీ ఎస్కేపింగ్‌కూడా లాయర్‌ కుండే ముఖ్య లక్షణం కాబోలు!" గమ్మత్తుగా నవ్వింది అంజా.

'నిన్ను మరిచి పోలేదు అంజా' అని చెప్పి ఉండ వలసిందనిపించింది.

మరి కాసేపు అంజా మాట్లాడలేదు. కానీ కదిలే ఆమె కనుపాపలు, అదిరే ఆమె అధరాలు ఏదో మధురరాగాన్ని శృతి చేస్తున్నట్లే ఉన్నాయి.

రెండు చేతుల మధ్యా పూల సజ్జను ఉంచుకుని అందులోకి చూస్తూంది అంజా. ఆమె కనుబొమల ఆర్చీలకు వేలాడుతూన్న కన్నుల పూగుత్తులు రాలి పూల సజ్జలో పడతాయేమోనని అనిపింప జేస్తూంది, ఆ నయన సౌందర్యం.

పూలసజ్జ మీద కదలాడుతూన్న వేళ్ళు నా హృదయవిపంచి మీది మధురమైన తీగలను సరిచేస్తూన్న భావన. శృతి చేస్తూన్న భావ ప్రకంపన. శృతి కుదిరి నో జ్ఞాపకాల రాగాలు పల్లవిస్తున్నాయి. అనుపల్లవి ప్రభవిస్తూంది...

"ఈ వూరు ఏం పని మీద వచ్చావ్?" అకస్మా త్తుగా అడిగింది అంజా.

"ఏం? నీ కోసం రాకూడదా?" నా తెలివికి నేనే సంతోషించాను.

నే నాశించిన సంతోషం కనుపించ లేదు అంజాలో.

"రాకూడదా అన్నావే కానీ 'నీ కోసమే వచ్చా'నని అనలేదు."

"అంజా! మాటలు బాగా నేర్చావ్!"

"ఈ వూళ్ళో అంతకంటే అవకాశం లేదు."

"పై వూరు వెళ్ళే అవకాశం నీవే అక్కర్లే దంటున్నావట కదా?"

ఉచితం ఉచితం ఉచితం

## తెల్లమచ్చలు

మా ఆయుర్వేద చికిత్స మచ్చలను తొల గిస్తుంది. మా ఔషధాలను క్రమం తప్ప వాడటంతో చాల కొద్దికాలంలోనే మచ్చల రంగు మారింది. మీరు కూడ మా చికిత్సను తప్పక పరీక్షించాలి. ఒక బుడ్డీ మందు ఉచితంగా ఇవ్వబడుతుంది. వెంటనే వ్రాయండి.

Gautam Chikitsalaya (SDP)
P.O. Katrisarai (Gaya)

ఎలాంటి
అజీర్ణమైనా
మంత్రించినట్లే
నయమవుతుంది



హ్యూలెట్స్ మిక్చర్

## మీకు బేబీ/బాబు కావాలా!



ఆపరేషన్, ఇతర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహా లచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతాపత్ర ములు కలవు. స్త్రీ పురుష వంధ్యాదోషనివా రణ నిపుణులు. ఉచిత వివరములకు

శ్రీ నాగార్జున మూలిక కుటీరం
రైల్వేస్టేషన్ వద్ద, రామాలయం వీధి,
తెనాలి - 2.

ఉలికి పడింది అంజు. నా వైపు చూస్తూ "నాన్నగారిని కలిశావా?" అంది.

తల వూపాను.

"ఆయనకు వయసైపోయింది. సందర్భంలేని ప్రసంగాలు తెస్తూ ఉంటారు."

నాకు చిరు కోపం వచ్చింది.

"నా ముందు నీ వివాహ ప్రసక్తి తేవడం అసందర్భమా! ?" విస్మయంగా అన్నాను.

"పోనీ సందర్భం ఏమిటో నీవే చెప్పు" చిన్నగా నవ్వుతూ అంది.

"నేను నీ చిన్ననాటి స్నేహితుణ్ణి. మాస్టారి శిష్యుణ్ణి. చాలా?" దీనంగా అన్నాను.

"నా చిన్ననాటి మిత్రులు చాలామంది ఉన్నారు."

"అంటే... అంటే వాళ్ళూ, నేనూ ఒకటేనా?" చురుగ్గా ప్రశ్నించాను.

"మరి నీ ప్రత్యేకత ఏమిటి? పదిహేనేళ్ళ తరవాత ఏదో పనిమీద ఇటు వైపు వచ్చి, చూడటానికి రావటమేనా?" చిలిపిగా అడిగింది అంజు.

లాభం లేదు. అంజు సరిగ్గానే మాట్లాడుతూంది. ఇన్నేళ్ళకు, అంజు అన్నట్లు పని మీద వచ్చి, ఇక్కడే కదా చూసి పోదామనుకోవటం... ప్చ్! నిజమే. నా ప్రత్యేకతేముంది? ఏమైనా నా ప్రత్యేకతను బలవంతంగా నైనా నిలుపుకో దలుచుకున్నాను.

"పోనీ మాస్టారు చేసింది అసందర్భ ప్రసంగమే అయినా, నీవిది చెప్పు. నీ వెందుకు పెళ్ళి చేసుకోవటం లేదు?"

నా కళ్ళలోకి లోతుగా చూసింది అంజు. ఆచూపులో నా ప్రశ్నకు సమాధానం లేదు. పైగా నన్నే ఏదో ప్రశ్నిస్తున్నట్లుగా అంది. ఆ చూపు చూస్తూ ఉంటే ఆమె నా కళ్ళ లోతులను దాటి, లోపలికి, మరీ లోపలికి, గుండె లోకి చూస్తున్నట్లుగా ఉంది!

"అంజూ" అన్నాను.

అతి బరువైన పదాన్ని దేన్నో అతి కష్టం మీద లాక్కుంటున్నట్లుగా చూపును వెనక్కు లాక్కుంది అంజు.

"అంజూ! నీ వివాహం గురించి మాస్టారు చాలా బాధ పడుతున్నారు."

నిర్లక్ష్యంగా నవ్వింది అంజు.

"నాకు బుద్ధి తెలిసినప్పటి నుండీ ఆయన దేనికో దానికి బాధపడటం చూస్తూనే ఉన్నాను ఎప్పుడూ! బాధ పడే వాళ్ళను కొత్తగా బాధించేదేమీ ఉండదు."

"కూతురుగా ఇంత నిర్దయతో మాట్లాడ్డం న్యాయం కాదు" విస్మయంగా అన్నాను.

"ఇందులో అన్యాయమేముంది మురళీ? నేను పెళ్ళి చేసుకున్నా మరి దేనికో బాధపడరని గారంటీ లేదుగా?"

"పెళ్ళి అయ్యాక ఇక బాధేముంది!" ఆశ్చర్య పోయాను. పక్కున నవ్వింది అంజు.

"పెళ్ళి కాకపోవడ మొక్కటే బాధనుకున్నావా? లేక పెళ్ళి అయితే బాధలే ఉండవను కున్నావా?"

మళ్ళీ నవ్వింది అంజు.

"పెళ్ళి అయినా నేను చక్కగా కాపురం చెయ్యొద్దా?"

"ఎందుకు చెయ్యవూ!?"

"పోనీ అతనే చెయ్యక పోవచ్చు కదా? నేనంటే

## కొత్త తరం

కొత్త కవిత రాదారికి
మేస్త్రీ శ్రీ శ్రీ!
కొత్తతరం గళానికి
అరుద్రే [illegible]సరి !

— ఎల్లోరా

ఇష్టం లేకపోతే?"

నిట్టూర్చి అన్నాను—"ఇవన్నీ వూహాగానాలు."

"అలాగే కానీ. మరి పిల్లలైనా పుట్టాలి కదా? నాకు పిల్లలు లేకపోతే నాన్నగారి కెంత బాధ!?"

అంజు నన్ను ఆట పట్టిస్తూందనిపించి బుంగ మూతి పెట్టుక్కూర్చున్నాను.

"కోపం వచ్చిందా మురళీ?" గోముగా అడిగింది అంజు.

ఆ స్వరంలోని మార్దవానికి కరిగిపోయాను.

"అంజూ! నేను నిన్ను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూండక పోవచ్చు. పదిహేనేళ్ళ తర్వాతే రావచ్చు. కాని గుర్తుంటూ చేసుకున్నాక నిన్ను తలుచుకుంటూనే ఉన్నాను. నిన్ను చూసే క్షణం కోసం ప్రతి క్షణం తహతహలాడి పోయాను. నీ దృష్టిలో నాకు ప్రత్యేకత లేక పోవచ్చు. కానీ నా దగ్గర నీకు చాలా ప్రత్యేకత ఉంది అంజూ! ఇంత వయసూ వచ్చి నీ వెందుకు వివాహం చేసుకోవటం లేదు. మాస్టారు వృద్ధులయ్యారు. ఆయన తర్వాత నీ వెవరి అండన ఉంటావు? అసలు మాస్టారెంత దిగులు పడుతున్నారు! ముఖ్యంగా నీ ఈ వైముఖ్యం ఎందుకో, నిన్నింత అయిష్టానికి దిగలాగిన ఆ కారణం ఏమిటో నేను తెలుసు కోవాలి. అది ఎలాంటి కారణమైనా నేను సరిజేయగలను అంజూ! నీవు పెళ్ళి చేసుకుని పిల్లా పాపలతో సుఖంగా ఉండాలి. నీవు సుఖంగా ఉండాలి అంజూ" వేదనాభరిత కంఠ స్వరంతో గట్టిగా అన్నాను.

అంజు విచలితయై చూసింది. నా అభిమానానికి సంతోషమో, అసందర్భ ప్రలాపనని సంతాపమో అర్థం కాలేదు. అంజు చూపులు పూలమాల పడిన చిక్కు ముళ్ళల్లా ఉంటున్నాయి. విప్పుకుని సరిచేసుకోవటం నాకు చేతకావటం లేదు.

అంజు నా నుండి చూపులు మార్చుకుంది. ఆమె కళ్ళు సగం విచ్చుకున్న మొగ్గల్లా అరమోడ్పు లయ్యాయి

"మురళీ! నేను పెళ్ళి చేసుకోలేక పోవడానికి ప్రత్యేక కారణమంటూ ఏదీ లేదు. ఈ వూరంటే నాకు ఎంతో ఇష్టం. ఈ వూరికీ, నాకూ ఏదో అవినాభావ సంబంధం ఉంది. ఈ వూరి గాలిలో నాకు మురళిగానం వినిపిస్తుంది. ఈ వూరి ఏరులో నాకు యమునా తరంగాలు కనిపిస్తాయి. ఈ పారం బోకు... ఈ తోట నాకు బృందావనం మురళీ! బృందావనం."

ఆశ్చర్యంగా చూశాను.

అంజులో నాకు రాధ కనిపించింది.

ఒక కాలు వెనక్కు మడచి, మెడ పైకి సారించి, అరమోడ్పు కళ్ళతో విరహిణియైన రాధ!

జారిన కన్నీటి బొట్లు బుగ్గల మీదుగా దుమికి అంజు చేతుల్లోని పూల సెజ్జలో పడ్డాయి.

ఈ అశ్రు పుష్పాలు ఏ కృష్ణుని పాద పూజ కొరకో! ! !

"అంజూ! నీ కృష్ణుడెవరు?"

అంజు ఉలికి పడుతుందనుకున్నాను. కానీ అతి నెమ్మదిగా కళ్ళు తెరిచింది. ఇంకా నెమ్మదిగా మెడ క్రిందికి దించుకుంది. బరువుగా నిట్టూరుస్తూ "నీకు సగమే అర్థమైంది మురళీ" అంది.

"మిగిలిన సగం నీవు చెప్పవచ్చుగా?"

"చెబితే అందాన్ని కోల్పోయేవి కొన్ని ఉంటాయి"

ఇంకేమనగలను? ఇంక ఏమీ చేయలేనుకూడా.

నాకు కావలసిన సగం ఆమెలో నిక్షిప్తమై ఉంది. అదే తెలుసుకోవాలి. కానీ ఆమె తెలియ నివ్వదు. అది ఆమె మాత్రమే తెలియ జేయ వలసింది. ఆమె అదొక్కటే దాచుకో వలసిందంటోంది.

ఆమె గుండె గుప్పిటిలో దాచి ఉంచిన ఆ సగం ఏమిటి? ఇక బయటకు రాను వీలులేకుండా ఘనీభవింపజేసిన ఆ గుండె మధ్యలో, సజీవంగా కద లాడే ఆ మిగిలిన సగం ఏమిటి?

ఇంతలో అంజు బాగా తేరుకుంది.

"ఉండు మురళీ! నీకు కాఫీ ఇస్తాను" అంటూ కదిలింది.

"అక్కర్లేదు అంజూ! మాస్టారిచ్చారు" అన్నాను వారిస్తూ.

"మాస్టారి కూతుర్నీ ఇవ్వనివ్వు" అంటూ పూల సజ్జ క్రింద పెట్టి, మూత బిగించి ఉన్న ఫ్లాస్కు అందుకుంది.

"చీకటి పడేదాకా ఇంటికి వెళ్ళడానికి తీరదు. అందుకే భోజనానికి వెళ్ళినప్పుడు కాఫీ పెట్టి నాన్నకు ఫ్లాస్కులో పోసి, నేనూ తెచ్చుకుంటాను" అంటూ మూల నున్న స్టూలు మీది గ్లాసుల్లో కాఫీ పోయసాగింది.

"అంజూ! నీకు పెళ్ళి అయి ఉంటుందని ఊహిస్తూ వచ్చాను. కానీ నీవు అవివాహితగానే ఎదురు పడ్డావు. నీ వివాహం చూస్తాననే ఆశ కూడా లేని విధంగా మాట్లాడుతున్నావు. పోనీ నా వివాహాని కైనా వస్తావా? అంజూ! నా [illegible] కుదిరింది."

అటు వైపు తిరిగి ఉన్న [illegible] "ఆహా" అంది.

"అమ్మాయి అందంగానే ఉంటుంది. బి.ఎ. పాసయింది."

"ఊహూ."

"మంచి కుటుంబం అమ్మ కెంతగానో నచ్చింది."

ఇటు తిరిగింది అంజు. ఆమె కళ్ళు పొడిగా ఉన్నాయి. ముఖం ప్రశాంతంగా ఉంది. స్నిగ్ధంగా నవ్వుతూ "చాలా సంతోషం మురళీ" అంది.

"నా పెళ్ళి చూస్తే నీకూ పెళ్ళి చేసుకోవాలని అనిపిస్తుందేమో. తప్పక వస్తావు కదూ?" అన్నాను ఆశగా.

"మనిషికి నీలాంటి భ్రమలు ఉండటం ఎంతో అవసరం. కానీ దురదృష్టవశాత్తూ నా లాంటి

ఉన్నత ప్రమాణాల పత్రికలు
అనేక ఏళ్ళ నుండి ఎంచుకునేవి

| | రూ |
|---|---|
| గల్ఫ్ సర్వీస్ సమాచార గైడు | 35/- |
| రేడియో అండ్ ట్రాన్సిస్టర్ గైడు | 15/- |
| టివి సర్వీసింగ్ మేడ్ ఈజీ | 20/- |
| 300 కుటీర పరిశ్రమల గైడు | 30/- |
| సెక్స్ అట్లాస్ (యు.ఎస్.ఏ ప్రచురణ) | 15/- |
| పడక గదిలో 68 రంగుల ఫోటోలు | 15/- |
| పురుషుడు స్త్రీని వశపరచుకునే విధానం | 15/- |
| కామ సూత్రాలు (వాత్స్యాయన) | 15/- |
| కోక శాస్త్రం (112 బొమ్మలతో) | 15/- |
| 144 రహస్య కెమెరా ఫోటో ఆల్బమ్ | 30/- |

మీ ఆర్డరుతో బాటు దయచేసి. పోస్టేజి మరియు పేకింగ్‌లకుగాను రు.4/- అడ్వాన్సు పంప గోరెదము.

RAJKAMAL PRAKASHAN
(3 B) ALIGARH 35




పూర్తి జీవితానికి అసాధారణమైన బలం

జీవనానికి మరింత కుతూహలాన్ని చేకూర్చి పెడుతుంది. ఒకాసా మీ శరీరంలో బలం, శక్తి తిరిగి సమకూర్చడానికి ఎందు శక్తివంతమైన 6 రసాయనిక పదార్థాలు, 6 ఖనిజములు, 10 అత్యావశ్యకమైన విటమినులు, అశ్వగంధ, యోహింబైన్ వంటి మొక్కల సారములు ఇమిడి వున్నాయి. ఒకాసా తీసుకోండి. జీవితం ఆనంద మయమౌతుంది.

ఇప్పుడు అనువైన కొత్త ప్యాక్‌లో

ఒకాసా

పేరెన్నికగన్న అన్ని మందుల దుకాణాలలోనూ దొరుకుతుంది.

ఒకాసావారి ఉచిత పుస్తకంకోసం వ్రాయండి:

OKASA CO. PVT. LTD.
P.O.Box No. 396, Bombay-400 001.

O37

భ్రమలేవీలేవు'' అంది కాఫీ గ్లాసు అందిస్తూ.

''నీవు చాలా అప్‌సెట్ అయినట్లున్నావు అంజా! ఆ కారణం ఏదో నే నెప్పటికైనా బయటకు లాగి తీరుతాను'' అన్నాను దృఢంగా.

'నీకది అసాధ్యం' అన్నట్లుగా నవ్వింది అంజా. మరి కాసేపు మౌనం గంభీరంగా పడచిపోయింది.

''తోటలోకి వెళ్తాంరా మురళీ'' అంటూ కదిలింది అంజా.

మాట్లాడుతూనే మాష్టారి పూజ కోసం సజ్జ నిండా పూలు కోసింది అంజా.

చీకట్లు కమ్ముకుంటున్నాయి. ఇద్దరం బయలు దేరాము.

దాంలో అడిగాను ''అంజా! ఆఖరిగారిగా అడుగుతున్నాను. నా మీద నీకే మాత్రం అభిమానమున్నా చెప్పు.''

''అభిమానానికీ, అభిమానంగా దాచుకున్న విషయాలను వెల్లడి చేయడానికీ ఏం సంబంధం ఉంది మురళీ?'' అంది.

ఈ మనోహరి మేరువుగా, ఈ సుకుమారి సుదృఢమైన వ్యక్తిగా బయట పడుతోంది. నా దగ్గర జవాబు దొరకని ప్రశ్నగా మిగిలిపోయినది అంజా వివాహం ఒక్కటే కాదు., అంజా కూడా.

''పోనీ నా పెళ్ళికి నీవు వచ్చే విషయమైనా చెప్పు.''

''అనుకున్నవి అన్నీ జరుగుతాయా మురళీ? నేను నీ పెళ్ళికి రావాలని రాసి పెట్టి ఉంటే తప్పక వస్తాను.''

దారులు చీలిపోయాయి.

## 8

మరునాడు ఉదయమే తయారై మాష్టారుకూ, అంజాకూ చెప్పి వద్దామని బయలు దేరాను. కానీ అప్పటికే అంజా లోటకు వెళ్ళిపోయింది.

''మురళి వస్తాడేమో ఆగమని అన్నాను. 'ఎవరి కోసమో పనులు ఆపుకుంటే ఎలా నాన్నా?' అంటూ వెళ్ళిపోయింది మురళీ! అదిప్పుడు బాగా ఆరింది ఇలా మారిపోయిందిలే'' అన్నారు మాష్టారు.

ఎందుకో అంజాకు నా మీద బాగా కోపంగా ఉంది. నేను చేసిన అపరాధం ఏమిటో ఎంత ఆలోచించినా బోధపడటం లేదు. అంజా సమస్యఏదైనా అందులో భాగం పంచుకుంటానన్నాను. నాకు చేతనైన సహాయం చేస్తానన్నాను. ఒక స్నేహితుడుగా ఇంతకంటే ఏం చేయగలను?

నిట్టూర్చాను.

''అదిగో ఆ గదిలో అంజా లైబ్రరీ ఉంది. చూస్తూ ఉండు. నే నిప్పుడే స్నానం చేసి బట్టలు మార్చుకుని వస్తాను. నీతో ఇస్టేండు దాకా వస్తాను'' అంటూ పెరట్లోకి వెళ్ళిపోయారు మాష్టారు.

అది చాలా చిన్న గది. గోడకున్న చాలా పెద్ద గూటిని నాలుగు అరలుగా చేసి పుస్తకాలు అందంగా అమర్చబడ్డాయి. ఒక అరలో ఇంగ్లీషు నవలలు, మరో అరలో తెలుగు సాంఘిక నవల లున్నాయి. మూడోదాంట్లో చారిత్రాత్మకమైన పుస్తకాలు, చివరి అరలో నాటికాలు వున్నాయి. నాలుగు అరలకు మధ్యనున్న చిన్న గూట్లో మూడు కోతుల బొమ్మ ముచ్చటగా వుంది.

గోడలకు ప్రకృతి వర్ణచిత్రాలు, తోటలోని వివిధ భాగాలలో తీసిన ఫోటోలు వున్నాయి. మరో గోడకు వున్న అద్దాల అల్మైరాలో బొమ్మలున్నాయి. బహుశా దసరా కొలువుకు ఉపయోగించే బొమ్మలు కాబోలు. ఆ అల్మైరాకు ఎదురుగా ఎదుటి గోడలో కటకటాల తలుపులున్న మరో అల్మైరా వుంది. అందులో కన్పించిన వస్తువు నన్ను విస్మయపరచింది. బాగా దగ్గరకు వెళ్ళి కటకటాల్లోంచి చూశాను. అసలైన దంతంతో చేసిన చిన్న మందసం. దానిమీద ఎంతో అందంగా, కళాత్మకంగా చెక్కిన నగిషీ అద్భుతంగా వుంది. ఏ జమీందారుల భవనాలలోనో వుండవలసిన ఇంత అపురూపమైన వస్తువు మాష్టారింట్లో...!

షర్టు గుండీలు పెట్టుకుంటూ మాష్టారు గదిలోకి వచ్చారు.

''ఏమిటి మురళీ! చూస్తున్నావూ?''

''ఈ దంతపు పెట్టె...?'' అంటూ ఆగిపోయాను.

''అర్థమైంది లేవోయ్. ఇది అంజా తాతగారిది. ఆయన అప్పటి జమీందారుగారి దివాణంలో పని చేసేవారట. ఏదో సందర్భంలో, ఆ జమీందారు ప్రశంసా పూర్వకంగా ఏదో ఆభరణాన్ని పెట్టి ఈ పెట్టెను అంజా తాతగారికి బహూకరించారట. ఆభరణం విషయం ఏమోగానీ పెట్టెను మాత్రం అంజా అమ్మమ్మ స్వంతం చేసుకుని, అందులో ఆమె ప్రాణంకంటే మిన్నగా చూసుకునే తన ప్రథమ ఉంగరాన్ని దాచుకునేదట. ఆమె నుండి ఈ పెట్టె అంజా తల్లికి సంక్రమించింది. నాకీ అయిదు మంది ఆడపిల్లలకంటే ముందుగా నో అబ్బాయి వుండేవాడు. నో వర్షాకాలం ఎవరో ఇల్లు కట్టడానికి తవ్విన పునాది గుంతలో ఆగిన నీళ్ళలోపడి మరణించాడు. వాడి మొలత్రాడులోని వెండి తాయత్తును నా భార్య జీవితకాలమంతా ప్రాణాధికంగా ఈ పెట్టెలో భద్రపరచింది. ఆమె తర్వాత ఇంట్లో మిగిలిపోయిన అంజా ఈ పెట్టెకు సొంతదారయింది. మరి అంజా ఇందులో ఏ ప్రాణాధికమైన వస్తువు దాచుకుందో నాకు తెలీదు'' అంటూ నవ్వారు.

వాళ్ళు వాళ్ళు ఇందులో దాచుకున్న వస్తువుల విలువ ముందు పెట్టె విలువ వెల వెల బోయింది నా దృష్టిలో.

స్త్రీ అమితంగా ప్రేమించే ప్రథమపు ఉంగరం, కోల్పోయిన ఏకైక పుత్రుని స్మృతి చిహ్నం...వీటి ముందు మరో విలువైన వస్తువేముంది? అయితే... అయితే...అంజా దాచుకున్నది కూడా అత్యంత విలువైందీ, ఆమెకు ప్రాణాధికమైందే అయివుంటుంది. నా కెందుకో ఆ వస్తువేమిటో చూడాలనిపించింది. చూసి తీరాలని ఆరాటం ఆరంభమైంది.

ఆ పెట్టె చూస్తూన్నకొలదీ, దాని చరిత్ర విన్నకొలదీ అందులోని వస్తువేమిటో తెలుసుకోకుండా ఇక్కడినుంచి కదలలే ననిపించింది.

''వెళ్దామా?'' అన్నారు మాష్టారు.

నేను కదలలేకపోయాను.

నవ్వారు మాష్టారు.

"నీకు బాగా నచ్చినట్లుందే ఆ పెట్టె! సరే, కావలసినంతసేపు చూడు. అంజా ఒప్పుకోదుగానీ, నీ కంత ఇష్టమైతే ఇచ్చేవాణ్ణి" అన్నారు.

నేను ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో మౌనంగా చూస్తూ నిలబడ్డాను.

మాస్టారెందుకో మళ్లీ లోపలికి వెళ్లిపోయారు. నేను చటుక్కున ఆత్రంగా తలుపులు తీసి పెట్టె అందుకున్నాను. దానికి చిన్న పిచ్చుకంత తాళం వేళ్లాడుతోంది. దాన్ని తీసి చూసేంత వ్యవధి లేదు. మాస్టారు రావచ్చు. పెట్టెను అప్రయత్నంగా అమాంతం కోటు లోపలి జేబులోకి తోసేశాను. కావాలంటే బయటకు వెళ్ళాక ఆ వస్తువేదో చూసి, ఏదో సాకుతో మళ్లీ వచ్చి దాని స్థానంలో దాన్ని వుంచేయవచ్చు.

మాస్టారు కళ్ళజోడు సర్దుకుంటూ గదిలోకి వచ్చారు.

ఎంత వారించినా వినకుండా మాస్టారు బస్టాండు దాకా వచ్చారు. బస్సు వచ్చి, నేను ఎక్కి బస్సు కదిలేదాకా వున్నారు. ఆ పెట్టె బయటకి తీసే అవకాశమే చిక్కలేదు. నాకు చాలా సిగ్గనిపించింది. అంజా దీన్నెలా తీసుకుంటుంది? కానీ నాలో మెదులుతున్నది అంజా దాచుకున్న ప్రియమైన వస్తువేదో దాన్ని చూడాలని మాత్రం కాదు. అంజా నేటి విచిత్ర ప్రవర్తనకూ, ఆమె వైరాగ్యానికీ, వైరాగ్యానికి కారణం ఏదో ఈ పెట్టెలో మరుగున పడి వుండే వుంటుందని నా మనసు గట్టిగా చెప్పి పట్టుబడుతోంది. అందుకే...అందుకే ఈ చౌర్యానికి, ఈ అనుచితానికి పాల్పడ్డాను. అంజా మీద నాకా మాత్రం హక్కు వుందని నా అంతరాత్మ నొక్కి చెబుతోంది.

బస్సు కదిలింది.

సీట్లో సర్దుకుని కూర్చుని పెట్టె తీశాను. ఎప్పటిదో పాతకాలం తాళం. ఇప్పుడా తాళాలే లేవు. చిన్నగా పిచ్చుకపిల్లలా వున్నా రాగి తాళం తెరవడానికి నాకు తెలియలేదు.

అంజా వేసిన ఇంత చిన్న తాళాన్ని తీయలేనివాణ్ణి ఆమె మనసు మాట విప్పగలనా అనిపించి నవ్వుకున్నాను.

మగాణ్ణి, అహంభావానికీ, ఆత్మ విశ్వాసానికీ ఆట పట్టయిన వాణ్ణి. తాళం తీయకుండా, పూరికి వెళ్ళే దాకా ఆగగలనా? ఎలాగైతేనేం తీశాను.

పెట్టెలో కాస్తంతంటే చిన్న సైజులో వున్న మెత్తటి ముఖమల్ కుషన్ పరచి వుంది. దానిమీద ఏ శతాబ్దం క్రితందో అన్నట్టుగా పాతబడి, ఎర్ర బడిన కాగితం, నాలుగు మడతలు పెట్టబడినది వుంది. ఆత్రంగా తీసి చూశాను.

ఎవరో సరిగ్గా చదువురాని కుర్రాడు, వచ్చీరాని తెలుగులో పెన్సిల్‌తో వ్రాసిన చేతి వ్రాత.

"స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సర మాఘ బహుళ శుద్ధ ఏకాదశి సరియగు శుక్రవారం ఉదయం ఆరు గంటల పదిహేను నిముషములకు వివాహ లగ్న శుభ ముహూర్తాలకుంతు నా కుమారుడు చి!! మురళికి, రామాయపాలెం రఘురామ మాస్టారుగారి కడ గొట్టు పుత్రిక చి!! కుం!! సౌరంజనిని ఇచ్చి...రా" ఇలా సాగిపోయింది!

నా గుండె ఆగినంత పనయింది. ఇది ఒకనొక నాడు పిల్లలందరం పెళ్లి ఆట ఆడుకుంటూ, ఆ మధ్యే జరిగిన వో పెళ్లి పత్రిక తెచ్చి, పిల్లాటగా దాన్ని మా పేర్లు పెట్టి కాపీ చేసి, మురిసిపోయిన శుభ లేఖ!!!

అంజా...అంజా...దీన్నింత భద్రంగా, ప్రాణాధికంగా, అపురూప వస్తువులా దాచుకునే ఈ దంతపు పెట్టెలో...

అంజా సెంటిమెంట్ సెంటులా ఈ పెట్టెలో గుబాళిస్తోంది.

అయితే అంజా కృష్ణుడు...నేనా!

అంజా దాచిన అశ్రు పుష్పాలు...నా కోసమా!

అంజా గుండె గువ్వలో దాగిన ఆ పగం నేనేనా!

అంజా ఘనీభవించిన గుండె మధ్య సజీవంగా కద లాడే ఆ సగమూ నేనేనా!

పెద్దగా మాటలు వినిపించి ఈ లోకంలోకి వచ్చాను. బస్సు ఆగి వుంది. ప్రయాణీకులు ఒక్క రొక్కరే బస్సులోండి క్రిందికి దిగుతున్నారు.

దిగబోతున్న నా ప్రక్క ప్రయాణీకుణ్ణి అడి గాను—"ఏం జరిగింది?" అంటూ.

"ఏదో రిపేరీ. మాటలాలేదా? మీరూ దిగండి. ఎటూ పట్లో గంట పట్టుగానీ కదలదు బండి" వినుగ్గా అంటూ దిగిపోయాడు.

నేనూ దిగాను.

"రామాయపాలెం నుండి ఎంత దూరం వచ్చింది?" కండక్టర్ నడిగాను.

"మూడు కిలోమీటర్లు సార్!"

ప్రయాణీకు లందరూ దిగేశారు. కొందరు దూరంగా నిలబడి సిగరెట్లు కాల్చుకుంటున్నారు. కొందరు కింద చతికిలబడి లోకాభిరామాయణం ప్రారంభించారు. మరి కొందరు రిపేర్ చేస్తున్న చోట గుమి గూడి ఉచిత సలహా లిస్తున్నారు.

నేను ఆ కాగితాన్ని పదేపదే చదివాను. తరవాత పదిలంగా పెట్టెలో భద్ర పరిచాను. పెట్టెను గుండె దగ్గర షర్టు జేబులో పదిల పరిచాను. తిరుగు ముఖం పట్టి రామాయపాలెం వైపు అడుగులు వేయసాగాను.

'పెళ్ళి అయినా నే నవక్కాగా కాపురం చెయ్యాలన్నా'

'ఈ పూరి గాలిలో నాకు మురళీగానం వినిపిస్తుంది.'

'ఈ పొలంలోకు, ఈ తోట నాకు బృందావనం మురళీ, నాకు బృందావనం.'

'నీకు పిచ్చే అనిపిస్తుంది మురళీ'.

'చెరిగే అందాన్ని కోల్పోయేవి కొన్ని ఉంటాయి.'

'మనిషికి నీ లాంటి ప్రేమ లుండటం ఎంతో అవసరం. కానీ దురదృష్టవశాత్తూ నా కలాంటి ప్రేమ లేనే లేదు.'

'అనుకున్నవి అన్నీ జరుగుతాయా మురళీ?'

అంజా మాటలు ఒక్కటొక్కటే గుర్తు వస్తు న్నాయి. అంజా మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించ లేకపోయిన నా మూర్ఖత్వం మీద కోపం వస్తోంది. సిగ్గు కలుగుతోంది.

నా కళ్ళలోకి ఆర్ద్రతా గుండె లోతుల్లోకి అంజా చూసిన చూపూ, ఒక కాలు వెనక్కు గుంజి, మెడ పైకి సారించి అభిమానపు కళ్ళతో విరహిణిలా నిలబడిన అంజా. కళ్ళ ముందు కదలాడసాగాయి దృశ్యాలు.

ఆమె మనస్సును తెలుసుకోకుండా నేను హామీ ఇచ్చిన పద్ధతి గుర్తు వచ్చి సిగ్గుతో చితికిపోయాను.

ప్రియతమా అంజా వ్రాసిన పాపు. . .

నా గుండె ద్రవించి పోయింది.

నేను నా లోకం లో ఉండగానే రామాయపాలెం వచ్చేసింది.

బస్టాండులో ఎర్రగా కొట్ట వచ్చినట్లు కనిపిస్తున్న పోస్ట్‌బాక్స్ కనిపించగా, అటు కేసి నడిచాను.

అవసరానికి పనికి వస్తాయని ఎప్పుడూ డైరీలో ఉంచుకునే పోస్ట్ కార్డుల్లోంచి ఒక కార్డు తీశా.

"ప్రియమైన అమ్మకు,

మురళి నమస్కరించి వ్రాయునది. ఆ పెళ్ళాళ్లకు సంబంధం నాకు నచ్చలేదు. ఈ విషయం నీవు వెంటనే వాళ్ళకు ఉత్తరం ద్వారా తెలియపరచు.

ఇక్కడ పని పూర్తయింది కానీ ఏదో బంధం నన్ను కదల నివ్వకుండా ఆపింది. అందువల్ల ఈ రోజు రాలేక పోతున్నాను. దీని గురించి సమక్షంలో వివరిస్తాను.

నమస్కారాలతో
నీ కుమారుడు
మురళి."

ఉత్తరం పోస్ట్ చేసి పూళ్ళోకి నడిచాను. ఎదురుగా పెళ్ళి. నన్నాయి స్వాగతం పలికింది. ✱

